క్లుప్తంగా

భవనాల పరిశీలన



వీపనగండ్ల: మండల కేంద్రంలో ప్రైవేట్ భవనంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని మరొక భవనంలోకి మార్చేందుకు అనువాన వాటి కోసం సోమవారం అదనపు కలెక్టర్ తిరుపతిరావు పరిశీలించారు. బీసీ బాలుర హాస్టల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు మరో ప్రైవేట్ భవనాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించారు. పాత తహసీల్దార్ భవనంలో సరైన వసతులు లేవని కోరినందున మరో భవనం కోసం పరిశీలన చేసినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ వరలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



చిన్నంబావి: మండలంలోని చిన్నమారుకు చెందిన కర్ణ ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. కాగా శనివారం బాధిత కుటుంబ సభ్యులను మిత్రులు నాగారాజు, ఇస్మాయిల్, తిరుమల్ రెడ్డి, పలువురు పరామర్శించారు. అనంతరం రూ.10వేలను అందించారు. కుటుంబానికి తమ మిత్రబృందం అన్ని విధాల అండగా ఉంటుందని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



మదనాపురం: మండలంలోని అజ్జకొల్లులో 1, 2, 3 అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నర్మద తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రీ స్కూల్ యాక్టివిటీస్ ప్రకారం స్టాక్ టీ హెచ్‌ఆర్ ఏడు నుంచి మూడు సంవత్సరాల చిన్నారుల ఫుడ్ పంపిణీ తదితర వాటిని పరిశీలించారు. చిన్నారులతో ఆటపాటలతో ఆడించారు.

వైద్యవృత్తి ఎంతో ఉన్నతమైంది



అమరచింత: వైద్యవృత్తి ఎంతో ఉన్నతమైందని రెడ్‌క్రాస్ జిల్లా ఉపాధ్యక్షుడు కలాంపాషా అన్నారు. జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రూపశ్రీని ఘనంగా సత్కరించారు. కరోనా సమయంలో వైద్యులు అందించిన సేవలు వెలకట్టలేమన్నారు. కార్యక్రమంలో నాగేశ్వర్ రెడ్డి, రాజు, సుమిత్ర, కవిత, లక్ష్మీనర్సమ్మ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



అమరచింత: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో పంచాయతీ కార్యదర్శులు ముందుండాలని ప్రత్యేకాధికారి చాంద్‌పాషా అన్నారు. మండలంలోని మస్తీపురం, కిష్టంపల్లి, నందిమళ్ల ఎక్స్‌రోడ్ పంచాయతీలను శనివారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి కలగకుండా నిత్యం ప్రజలకు మిషన్ భగీరథ నీటిని అందించడంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యంగా ఉండొద్దని రహదారులను ఎప్పటికప్పుడు శుభ్రపరిచే కార్యక్రమాలను చేపట్టాలని కార్యదర్శులను సూచించారు.

ప్రత్యేకాధికారికి సన్మానం

పెబ్బేరు రూరల్: మండలంలోని శాఖాపూర్ వై పంచాయతీకి నియమించిన ప్రత్యేక అధికారి రోజారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆమెకు మాజీ సర్పంచ్ రవికుమార్‌యాదవ్ బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఆమెను గ్రామస్తులతో కలిసి సన్మానం చేసి కార్యాలయంలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోట్ల బాలచంద్రారెడ్డి, విజయలత, కార్యదర్శి శేఖర్‌రెడ్డి, ఎల్లయ్య, ఎరుకలి బలరాం, శ్రీనివాసులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం

- పట్టణంలో మూడు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- రూ.18 లక్షలతో విద్యుత్ లైన్ పనులు



4వ వార్డులో స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

అమరచింత: మున్సిపాలిటీలో ఆయా వార్డులలో లోఓల్టేజీ సమస్యను పరిష్కరించే విధంగా మున్సిపల్ పాలకవర్గం శ్రీకారం చుట్టింది. సుమారు రూ.18 లక్షల వ్యయంతో 6,7 వార్డులతో పాటు 8, 9, 4, 5 వార్డులలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి శాశ్వతంగా సమస్య కలగకుండా చర్యలు చేపట్టింది. వీటికి గాను గతేడాది ప్రతిపాదనలు సిద్ధంగా చేయగా, నిధులు మంజూరు కావడంతో పనులు చేసేందుకు ట్రాన్స్‌కో అధికారులు సిద్ధమయ్యారు. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్‌తో త్వరితంగా పనులు చేపట్టి వారం లోగా వీటిని పూర్తి చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. పట్టణంలో ప్రధాన రహదారిపై ఉన్న 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా నాలుగు వార్డులకు విద్యుత్ సరఫరా అవుతుండడంతో నిత్యం ఓవర్ లోడ్‌తో సమస్య జఠిలంగా మారింది. వీటిని అధిగమించడానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ట్రాన్స్‌కో అధికారులతో సమావేశమై అదనంగా పట్టణానికి మూడు 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేసుకున్నారు.

వేగంగా విద్యుత్ లైన్ ఏర్పాటు

పట్టణంలోని గణేష్‌నగర్‌లో ఆరు, ఏడు వార్డుల ప్రజలకు విద్యుత్ సమస్య తలెత్తకుండా కొత్తగా విద్యుత్ స్తంభాలు, వైర్లు ఏర్పాటు చేస్తున్నారు. 8, 9వ వార్డులలో ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు స్తంభాల ఏర్పాటు పనులు చేపడుతున్నారు. నాలుగు, ఐదో వార్డులలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులలో స్థానికంగా వివాదాలు కలిగి పనులు నిలిచి పోతుండటంతో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆయా కాలనీ వాసులతో మాట్లాడి కరెంట్ సమస్య పరిష్కారం కోసం సహకరించాలని కోరడంతో ఆయా కాలనీలలో పనులు మొదలయ్యాయి. వారం రోజుల వ్యవధిలో ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటు పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు.



బీసీ కాలనీలో స్తంభాల ఏర్పాటు

సమస్య పరిష్కరించేందుకు..



పట్టణంలో లోఓల్టేజీ సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ పాలక వర్గం శ్రీకారం చుట్టింది. వీటికోసం రూ.18 లక్షల వ్యయంతో పనులను ఆయా వార్డులలో చేపట్టాం. పనులు పూర్తి చేసి ప్రజలకు నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం.
– మంగమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్, అమరచింత

తారస్థాయికి చేరిన అవిశ్వాసం

- వనపర్తి పురపాలికలో 16 మంది కౌన్సిలర్ల ఆమోద సంతకాలు
- తేల్చకుంటే సొంతంగా ముందుకెళ్తామని మాజీ మంత్రికి సందేశం?

వనపర్తిటౌన్: వనపర్తి పురపాలికలో అవిశ్వాస ఘట్టం తారస్థాయికి చేరింది. ఈ అంశాన్ని బీఆర్ఎస్ నాయకత్వం నెలరోజులుగా కాలయాపన చేస్తోందన్న ధోరణికి వచ్చిన అసమ్మతి కౌన్సిలర్లు వెంటనే నిర్ణయం తీసుకోవాలని.. లేదంటే తామే అవిశ్వాసం కోరుతూ అధికారులను ఆశ్రయిస్తామని అల్టిమేటం జారీ చేసినట్లు స్థానికంగా ప్రచారం జోరందుకుంది. ఇప్పటికే పుట్టపాక మహేష్ సారథ్యంలో అవిశ్వాసం కోరుతూ 16 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసిన ప్రతిని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి వాట్సాప్‌లో పంపినట్లు తెలుస్తోంది. వెంటనే నిర్ణయం తీసుకోవాలని.. లేదంటే మంగళవారం తర్వాత తామే స్వచ్ఛందంగా ముందుకు వెళ్తామంటూ సందేశం పంపినట్లు కౌన్సిలర్లు గుసగుసలాడుకుంటున్నారు. జనవరి 4న మాజీ మంత్రి, మాజీ రాజ్యసభ సభ్యుడు హైదరాబాద్‌లో కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించి బుజ్జగించినా.. అసమ్మతి సెగ నేటికీ తగ్గలేదు. మెజార్టీ కౌన్సిలర్ల నిర్ణయం మేరకు ముందుకెళ్దామన్న నాయకులు కాలయాపన చేస్తున్నారంటూ వైస్ చైర్మన్ ప్రస్తావన లేకుండా చైర్మన్ ఒక్కడిపైనే అవిశ్వాసం పెట్టాలనే యోచనలో మరో అసమ్మతి బృందం కొత్త వాదాన్ని తెరపైకి తీసుకొచ్చింది. అసమ్మతి వర్గం వేగంగా పావులు కదుపుతుండటంతో మాజీ మంత్రి జోక్యం చేసుకొని త్వరలో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుందామని దాటవేయటంతో శనివారం ఒక్కసారిగా అంశం జిల్లాకేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. వనపర్తి మున్సిపాలిటీలో మొత్తం 33 మంది కౌన్సిలర్లు ఉండగా.. బీఆర్ఎస్ పార్టీకి 23 మంది, కాంగ్రెస్‌పార్టీకి 9, టీడీపీ కౌన్సిలర్ ఒక్కరు ఉన్నారు. అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే 2/3 మెజార్టీ కావాల్సి ఉంటుంది.

కేరళ, తెలంగాణ మంత్రులతో భేటీ



మంత్రులతో భేటి అయిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి: నియోజకవర్గ అభివృద్ధికి సంపూర్ణంగా సహకరిస్తానని రాష్ట్ర రెవెన్యూ, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. శనివారం అభివృద్ధి పనుల కోసం నియోజకవర్గంలోని పలువురు నాయకులతో కలిసి సచివాలయంలో మంత్రిని కలిశారు. ధరణి పోర్టల్ స్థానంలో భూమాతా ఏర్పాటు విషయమై సచివాలయంలో కేరళ రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి రాజన్, తెలంగాణ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి, ప్రిన్సిపల్ కార్యదర్శి సాంబశివరావుల భేటీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భూ సంబంధిత సమస్యల పరిష్కారాల కోసం చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

పాన్‌గల్: మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని జమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి సామర్థ్యాలను పెంచేలా బోధన సాగాలన్నారు.

సమతా దీక్షలో భాగంగా బియ్యం సేకరణ



బియ్యం సేకరిస్తున్న సమతా దీక్ష సభ్యులు

వనపర్తిటౌన్: సమతాదీక్షలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని ఇంటింటికీ తిరిగి బియ్యం సేకరించారు. దీక్ష సభ్యులు ప్రమీల, రాజేశ్వరి మాట్లాడుతూ.. సమత దీక్షను మొదట సాక్షాత్తు శ్రీరామచంద్రుడే చేశాడని, దీక్షకు అందరూ అర్హులని చెప్పారు. 27 రోజులో తులసిమాల ధరించి, పచ్చ దుస్తులు కట్టుకొని, 'శ్రీమతే రామానుజాయ నమః' మంత్రం చదవడం, ఒక కలశం తీసుకొని ఒక వైపు ఈ మంత్రం రాసి, మరో వైపు సమతాదీక్ష, సమతాకుంభ్–2024 జై శ్రీమన్నారాయణ అని రాసి దీక్ష చేపడతామన్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన



జాతర ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తున్న సీఐ నాగభూషన్‌రావు

పాన్‌గల్: మండల కేంద్రంలో ఈనెల 6వ తేదీ నుంచి ప్రారంభంకానున్న ఈదమ్మ జాతర ఏర్పాట్లను శనివారం సీఐ నాగభూషన్‌రావు, మండల స్థాయి అధికారులతో కలిసి పరిశీంచారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వాహనాల పార్కింగ్, తాగునీటి వసతి, వైద్య శిబిరాలు, పారిశుద్ధ్య చర్యలు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు హైమావతి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ అశోక్ నాయుడు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాములు, ఎస్ఐ వేణు, నాయకులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న నాయకులు

పెబ్బేరు రూరల్: కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన మండల కేంద్రంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా 29 చట్టాలని నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికవర్గానికి ద్రోహం తలపెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడుదారులకు ధనవంతులకు వంత పాడుతూ కనీస హక్కులను, చట్టాలను కాలరాశారని విమర్శించారు. వివిధ సంస్థలలో పని చేస్తున్న కార్మికులు సమ్మెల్లో పాల్గొనాలని కోరారు. శ్రీనివాసులు, వడ్ల శ్రీనివాసచారి, అప్సర్, అంజి, వెంకటస్వామి, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరించిన కేంద్ర ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది

అమరచింత: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.ఆది విమర్శించారు. మండల ఎస్ఎఫ్ఐ రెండవ మహాసభలను శనివారం పట్టణంలోని నిర్వహించగా ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి పాల్గొని మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో ఉన్నత విద్యారంగంలో 28శాతం విద్యార్థినుల ఎన్‌రోల్‌మెంట్ పెరిగిందనడం, సైన్స్, టెక్నాలజీ ఇంజినీరింగ్, మెడికల్ విభాగాల్లో విద్యార్థినుల చేరిక 43 శాతంగా ఉందని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీజేపీ అధికారం చేపట్టిన తర్వాత విద్యార్థినులు చదువులకు దూరమయ్యారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో, కేంద్రీయ పాఠశాలల్లో, నవోదయ పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు లేవన్నారు. స్కిల్ ఇండియా ఏర్పాటు చేసి 1.8కోట్ల మంది యువతను స్కిల్డ్ యువతగా తీర్చిదిద్దామని తెలిపారని, ఎన్ని లక్షల యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారో సమాధానం చెప్పాలన్నారు. నూతన ఐటీఐలు, ఐఐటీలు, మెడికల్ కళాశాలలు, ఐఐఎంలు ఏర్పాటు చేసినట్లు గొప్పలు చెప్పడం ఎంత వరకు సమంజసం అన్నారు. ప్రభుత్వమే 390కి పైగా ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతులిచ్చి ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేశారన్నారు. ఏకలవ్య పాఠశాలలు, సైనిక్ స్కూల్స్ తదితర ఏర్పాటు చేసినట్లు చెప్పుకోవడం కాదని అవి ఎక్కడ ఏర్పాటు చేశారో చెప్పాలన్నారు. నూతన విద్యావిధానం పేరుతో విద్యారంగాన్ని ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే కుట్రలు చేస్తుందన్నారు. విద్యారంగాన్ని విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వ కుట్రలను విద్యార్థిలోకం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలి, రాఘవ, రమేష్, రాకేష్, శ్రీకాంత్ పలువురు పాల్గొన్నారు.

ఆది బసవేశ్వర ఆలయానికి విరాళం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో ఉన్న ఆది బసవేశ్వర ఆలయంలో రేకులషెడ్డు నిర్మాణానికి రూ.లక్ష విరాళాన్ని సింగిల్‌విండో చైర్మన్ జగనాథంనాయుడు శనివారం ఆలయ కమిటీ అందజేశారు. ఆంజనేయులు, నందు, రవియాదవ్, గంగాధర్ యాదవ్ పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 'ఇంపాక్ట్ మోటివేషనల్ ఆర్గనైజేషన్' ఆధ్వర్యంలో విద్యార్థులకు శశిరేఖ, మోహన్‌లచే వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి విలువలను, నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. పరీక్షల్లో ఏ విధంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చో సూచించారు.

సదరం క్యాంపునకు దరఖాస్తు చేసుకోండి

పెబ్బేరు రూరల్: దివ్యాంగుల కోసం వనపర్తి జిల్లా ఆస్పత్రిలో నిర్వహించే సదరం క్యాంపునకు ఈ నెల 5వ తేదీ వరకు మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మెడికల్ బోర్డు సూపరింటెండెంట్ నరేందర్‌కుమార్ తెలిపారు. వనపర్తి జిల్లాలోని దివ్యాంగులు, సదరం సర్టిఫికెట్ పొందని దివ్యాంగులు, రెన్యూవల్ చేసుకోని వారు, అర్హులు గల వారు ఫిబ్రవరి, మార్చి నెలలు కలిపి ప్రభుత్వ ఆస్పత్రిలో వారానికోసారి క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్యాంపునకు వచ్చే వారు ఆధారు కార్డు, దరఖాస్తు చేసిన రసీదు, పాత సదరం సర్టిఫికెట్, ఫొటో, ,పాత రిపోర్టులు తీసుకురావాలని సూచించారు.

వీసీలో పాల్గొన్న అధికారులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, పంచాయతీ రాజ్ శనివారం నిర్వహించిన వీసీలో జీపీల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు. జీపీలకు కేటాయించిన అధికారులు ఆయా గ్రామాలల్లో అందుబాటులో ఉండాలని, తాగునీరు, పారిశుద్ధ్య నివారణ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈనెల 7 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రత్యేక పారిశుద్ధ్య నివారణ వారోత్సవాలను నిర్వహించాలని సూచించనట్లు అధికారులు పేర్కొన్నారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ అశోక్‌నాయుడు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాములు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలు

కొత్తకోట రూరల్: విద్యార్థి దశ నుంచే కష్టపడి చదివితేనే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని బాలల సంరక్షణ అధికారి సురేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అప్పరాల జెడ్పీహెచ్ఎస్‌లో 'బాలల హక్కులు–చట్టాలపై' విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాల్యాన్ని దుర్వినియోగం చేసుకోవద్దని, మంచి లక్ష్యాలతో, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ చదువుకోవాలన్నారు. బాల్యంలో ఎలాంటి దురాలవాట్లకు, అవాంఛనీయ ఘటనలకు చోటివ్వకుండా జాగ్రత్తగా మెలగాలన్నారు. ప్రతి ఒక్కరితో సఖ్యతగా, స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. ఏదైనా సరే తల్లిదండ్రులకు, గురువులకు తెలిసేలా ఉండాలన్నారు. పదో తరగతి పూర్తయిన అమ్మాయిలకు బాల్యవివాహం చేయాలని చూసిన, బడి మానేయాలని చూసినా, చైల్డ్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం గోపాల్, చైల్డ్ లైన్ సిబ్బంది రవిరాజు తదితరులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: వనపర్తి జిల్లాలోని పంచాయతీలలో రెండేళ్ల నుంచి చేసిన పనుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని జిల్లా సర్పంచ్‌ల సంఘం నాయకులు శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కరోనా కారణంగా సర్పంచ్‌ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదన్నారు. పంచాయతీలకు మంజూరయ్యే కొత్త గ్రాంట్‌ల పనులను ప్రస్తుత మాజీ సర్పంచ్‌ల ద్వారానే పనులు చేపట్టాలని, ప్రత్యేక అధికారుల వ్యవస్థను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కొండయ్య, రామకృష్ణ, అనిత, లక్ష్మి, భానుప్రకాష్, జయరాంనాయక్ పాల్గొన్నారు.

మూఢనమ్మకాలు లేని సమాజం నిర్మిద్దాం



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

పెబ్బేరు రూరల్: మూఢ నమ్మకాలు లేని సమాజ నిర్మాణానికి నేటి విద్యార్థులు కృషి చేయాలని జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సైన్స్ టాలెంట్ పేపర్లను ఆవిష్కరించారు. జేవీవీ నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకున్నప్పుడే శాస్త్ర అధ్యయనానికి తోడ్పడుతుందన్నారు. దొంగబాబాలతో విద్యార్థులు అప్రమత్తతై ఉండాలన్నారు. విద్యార్థులు రాబోయే తరానికి గొప్ప విజ్ఞానాన్ని అందించాలన్నారు. దేశం శాస్త్ర సాంకేతిక రంగంలో దూసుకుపోతున్నా, మరో వైపు సమాజం మూఢనమ్మకాల వైపు పయనిస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 14వేల మంది విద్యార్థులు చెకుముకి సైన్స్ సంబరాలలో పాల్గొన్నారని, ఈ నెల 9, 10, 11న వరంగల్ జిల్లా జనగామలో జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ సంబరాలలో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆడం రాజు మ్యాజిక్ ప్రదర్శించి విద్యార్థులకు మూఢనమ్మకాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా స్థాయి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో నారాయణ, రఘు, నాగేషు, అర్జున్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఎరువుల కొనుగోలుకు ఆధార్ తప్పనిసరి



సోళీపురంలో పరిశీలిస్తున్న అధికారులు

ఖిల్లాఘనపురం: రైతులు ఎరువులు కొనడానికి వెళ్లినప్పుడు తప్పనిసరిగా ఆధార్ నంబర్ నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ సూచించారు. శనివారం మండలానికి వచ్చిన ఆయన మండల వ్యవసాయ కార్యాలయం వద్ద ఏఓ మల్లయ్య, ఏఈఓలతో సమీక్ష నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు సోళీపురం, మానాజీపేటలో ఎరువులు, విత్తనాల దుకాణాలను పరిశీలించారు. దుకాణాల్లో స్టాక్ బోర్డులు, ఎరువులు, విత్తనాల నిల్వలు తనిఖీ చేశారు. యాసంగి పంటలకు సరిపడ ఎరువులు రైతులకు దుకాణాలలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఏఈఓలు తరుచుగా గ్రామాల్లో తిరుగుతూ పంటలను పరిశీలించి అవసరమైన ఎరువులు, పురుగుమందులను వాడేలా రైతులకు సూచనలు చేయాలన్నారు. సకాలంలో తెగుళ్ల నివారణకు మందులు వాడటం వలన పంటలను కాపాడినవారవుతారన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు బాల్‌రాజు, మహేష్, రమేష్, పాండు, వంశి, మాధవి పాల్గొన్నారు.

అందరూ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి

కొత్తకోట రూరల్: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో శనివారం చౌరస్తాలో ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు, వాహనాలతో రోడ్డుపై వెళ్లేటప్పుడు తీసుకోవాల్సి జాగ్రత్తల గురించి వివరించారు. బైక్ నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ పెట్టుకుంటే ప్రయోజనాల గురించి, పెట్టుకోకుంటే నష్టాన్ని వివరించడంతో పాటు తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలు ఇచ్చి వివిధ పనుల నిమిత్తం రోడ్డుపైకి పంపిస్తే జరిగే నష్టాల తెలియజేశారు. ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.

మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్‌కు సన్మానం



మదనాపురం: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణయ్య ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల మాజీ సర్పంచ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అబ్రహం లింకన్, ఎంపీడీఓ నాగేంద్రం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: ఐదేళ్ల పదవి పూర్తయిన గోపాల్‌పేట మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, ఉపసర్పంచ్ శివ కుమార్‌ను శనివారం మండల కేంద్రంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, కొంకి రమేష్, నాగరాజు శాలువాలు, పూలదండలతో సన్మానం చేశారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీస్

పెబ్బేరు రూరల్: ఈ నెల 16న దేశవ్యాప్త సమ్మెలోకి వెళ్తున్నామని శనివారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ తిరుపతిరావు, డీఈఓ కార్యాలయంలో సమ్మె నోటీస్ అందజేశారు. మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ విక్రమసింహారెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, విమల, మన్నెమ్మ, లక్ష్మమ్మ, కురువమ్మ, రేణుక, కళమ్మ, చంద్రయ్య, చందు, మన్యం తదితరులు పాల్గొన్నారు.

